
నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, ఆదివారం 14 జూలై 2024 | KHAMMAM



మత్స్యకారులకు మళ్లీ కష్టాలు ప్రారంభం కానున్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పదేండ్లు వెలుగులు విరజిమ్మిన వారి జీవితాల్లో చీకట్లు కమ్ముకోనున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో వీరిని పట్టించుకున్న ప్రభుత్వాలు లేవు.. పాలకులు లేరు. ఎప్పుడైతే తెలంగాణ రాష్ట్రం అవతరించిందో అప్పటినుంచి వారి మోముల్లో కాంతులు ప్రకాశించాయి. మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన చేపపిల్లల పంపిణీ పథకం మత్స్యకారుల బతుకులను సమూలంగా మార్చేసింది. వందకు వందశాతం ఉచితంగా ప్రభుత్వమే చెరువుల్లో చేపపిల్లలను పోసి కొండంత అండగా నిలబడింది. కానీ.. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కారుతో మళ్లీ వారి జీవితాలు అంధకారంలోకి వెళ్లడం ఖాయంగా కనిపిస్తున్నది. జూలై నెల వచ్చినా ఈ ఏడాది ఉచిత చేపపిల్లల ఊసేలేకపోవడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

*- భద్రాద్రి కొత్తగూడెం, జూలై 13 (నమస్తే తెలంగాణ)*



- ఈ ఏడాది 'ఉచిత చేప పిల్లలు' లేనట్లే?
- జూలై వచ్చినా ఆ ఊసెత్తని కాంగ్రెస్ సర్కారు
- వేలాది కుటుంబాల్లో కమ్ముకోనున్న చీకట్లు
- జిల్లాలో బోసిపోనున్న 743 చెరువులు
- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు

# మత్స్యకారులకు మళ్లీ కష్టాలే!

రాష్ట్రంలో కొత్త సర్కారు వచ్చి ఒక్కో పథకానికి మంగళం పలుకుతోంది. గత కేసీఆర్ సర్కారు హయాంలో ప్రతిష్ఠాత్మకంగా కొనసాగిన ఉచిత చేప పిల్లల పంపిణీ ఈ ఏడాది కొండెక్కినట్లే కనిపిస్తున్నది. ప్రతి ఏటా జూన్ వచ్చిందంటే ప్రభుత్వమే చేపపిల్లలను మత్స్యకారులకు ఉచితంగా చెరువుల్లో పోసి వారి జీవనోపాధికి తోడ్పాటునిచ్చేది. దీంతో మత్స్యకారులకు ఆదాయం సమకూరి జీవనం సాఫీగా సాగేది. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపపిల్లల పంపిణీకి బ్రేక్ వేసింది. జూలై వచ్చినా చేపలు కాదు కదా దానికి సంబంధించిన టెండర్లు కూడా వేయకపోవడం వారి చేతగానితనానికి నిదర్శనంగా చెప్పొచ్చు.

## చేపపిల్లల పంపిణీ ఊసేలేదు..

గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతి యేటా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 743 చెరువుల్లో 1,77,45,900 చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేసేవారు. కానీ.. నేటి కాంగ్రెస్ పాలనలో ఆ ఊసే కనబడడం లేదు. 663 చిన్న చెరువులు, 77 పెద్ద చెరువుల్లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఉచితంగా చేపపిల్లలను ఇచ్చేవారు. దీంతో సంఘాల సభ్యులు చేపల వేట చేసుకుని లబ్ధి పొందేవారు. జిల్లాలో 968 మత్స్యకారుల సంఘాలను గత కేసీఆర్ సర్కారు బలోపేతం చేసింది. ఇందులో సభ్యులు 2,598 మంది ఉన్నారు. వీరంతా చేపల వ్యాపారంపైనే ఆధారపడి జీవిస్తూ.. మరోవైపు చిన్నపాటి వ్యవసాయం చేస్తుండేవారు. ప్రస్తుతం ఈ ఏడాది నేటికీ చేపపిల్లలను పంపిణీ చేయకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

## బోసిపోనున్న 743 చెరువులు

వానకాలం వచ్చిందంటే చాలు చెరువులు చేపల పిల్లలతో సందడిగా మారేవి. కానీ.. ఈ ఏడాది సర్కారు చేపపిల్లలను పంపిణీ చేయకపోవడంతో చెరువులన్నీ బోసిపోనున్నాయి. చెరువుల మీద ఆధారపడిన వారికి నిరాశే ఎదురుకానున్నది.



## టెండర్లు కాలేదని తెలిసింది..

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. గతంలో మాదిరిగానే ఎన్ని చెరువులు ఉన్నాయి.. ఎన్ని చేపపిల్లలు అవసరం.. అని ఒక జాబితాను తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం. ప్రతి సంవత్సరం జూలై నాటికి చేపపిల్లలను పంపిణీ చేయడం జరిగేది. కానీ.. ఈసారి ఇంతవరకు మాకు ఎలాంటి సమాచారం రాలేదు. వస్తే తప్పకుండా పంపిణీ చేస్తాం. ఈ ఏడాది ఇంకా టెండర్లు కాలేదని తెలిసింది.

**– వీరన్న, జిల్లా మత్స్యశాఖ అధికారి**

## ఈ ప్రభుత్వంలో నమ్మకం లేదు..

గత కేసీఆర్ సర్కారు హయాంలో ఈ పాటికి చేపపిల్లలను వదిలేసేవాళ్లం. ఇప్పుడు కనీసం టెండర్లు కూడా కాలేదని చెబుతున్నారు. చేపల వేటమీద ఆధారపడి చాలామంది ఉన్నాం. చేపలు రావని తెలిశాక బాధపడుతున్నాం. ప్రభుత్వం ఏదిచేసినా ప్రజల కోసం పనిచేయాలి. పేదలకు న్యాయం చేయాలి.

**– సూర్యం, మత్స్య సంఘం చైర్మన్, శింగభూపాలెం, సుజాతనగర్ మండలం**



"హలో.. నా వయస్సు 60 ఏండ్లు. నా ప్రయాణంలో ఎన్నో టన్నులకొద్దీ బరువులు మోశాను. ఎన్నెన్నో వరద బీభత్సాలను తట్టుకున్నాను. మరెన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నాను. అయినా మరెన్నో ఏళ్లు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాను. ఎంతటి బరువునైనా మోయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తా. గోదావరి తోడుగా నా పయనాన్ని శక్తి ఉన్నంతవరకు కొనసాగిస్తా.."

భద్రాచలం వద్ద గోదావరి నదిపై 1965, జూలై 13న అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన వారధి శనివారం 60వ పడిలోకి అడుగుపెట్టింది. ఆనాడు రూ.70 లక్షల వ్యయంతో నిర్మించిన బ్రిడ్జిని అప్పటి రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్‌హెచ్ 30కి అనుసంధానంగా ఉన్న ఈ బ్రిడ్జి ఆంధ్రప్రదేశ్‌తోపాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు వారధిగా నిలిచింది. ఎన్నో వరదలను, ఆటుపోట్లను తట్టుకొని నిరంతరాయంగా వాహనదారులకు సేవలందిస్తోంది. ఇప్పటివరకు ఏమాత్రం చెక్కుచెదరలేదంటే అప్పటి నాణ్యతా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.



అరవై పడిలోకి అడుగు పెట్టిన గోదావరి బ్రిడ్జి

# నాకు 60 ఏండ్లు

అప్పట్లో నా ఖర్చు రూ.70 లక్షలే..
నాలుగు రాష్ట్రాలకు పయనం నాపైనే..
రామయ్య సన్నిధికి వారధి నేను..
టన్నులకొద్దీ బరువులు మోశా..
ఇంకా మోస్తా..
ఎన్నో వరద ఆటుపోట్లు తట్టుకున్నా..

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 13 (నమస్తే తెలంగాణ) : దక్షిణ అయోధ్య భద్రగిరి కొండపై కొలువై ఉన్న రామయ్యకు గోదావరి వారధి పెద్ద పేరు తెచ్చిపెట్టింది. 1965వ సంవత్సరంలో నిర్మించిన గోదావరి బ్రిడ్జి శనివారం 60వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఆనాటి కట్టడం నేటికీ చెక్కుచెదరకుండా మారుమూల ప్రాంతాల గిరిజనులను బాహ్యప్రపంచానికి పరిచయం చేసిన తొలి వంతెన భద్రాద్రి బ్రిడ్జిగా పేరు తెచ్చుకుంది. భద్రాచలానికి దూరప్రాంతాల నుంచి భక్తులు రావాలంటే ఆనాడు కేవలం పడవ తప్ప వేరే మార్గమే లేదు. అప్పట్లో నదిలో నీరు లేనప్పుడు కాలినడకన భక్తులు బూర్గంపాడు మండలం గొమ్మూరు నుంచి వచ్చేవారు. నీరు పెరిగితే పడవపై వచ్చేవారు. అప్పట్లో పడవపై ప్రయాణించే 150 మంది మృతిచెందడంతో భద్రాచలానికి వారధి అనివార్యమైంది. అదే గోదావరి బ్రిడ్జిగా నామకరణం చేశారు.




భద్రాచలం బ్రిడ్జిపై శిలాఫలకం

## మన్యానికి వారధిగా భద్రాద్రి బ్రిడ్జి..

ఉమ్మడి ఖమ్మంజిల్లాతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భద్రాచలం పట్టణానికి రావాలంటే బస్సులు లేని సమయంలో కాలినడకన వచ్చే ప్రజలు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. వారధి నిర్మాణంతో అన్ని ప్రాంతాల ప్రజలు భద్రాచలం రావడం చాలా సులువైంది. భద్రాచలంలో జరిగే రామయ్య కల్యాణం, ముక్కోటి, రామయ్య పట్టాభిషేకం, గోదావరి పుష్కరాలు చూడాలంటే భక్తులకు వారధి ఎంతగానో ఉపయోగపడింది. దీంతో మన్యానికి వారధి గిరిజన ప్రాంతాలకు ఒక వరంలా మారింది.

## నాలుగు రాష్ట్రాలకు ఇదే రహదారి..

కేవలం ఖమ్మంజిల్లానే కాదు ఇతర రాష్ట్రాలకూ ఈ వారధి ఎంతగానో ఉపయోగపడింది. ఒడిశా, ఛతీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఈ బ్రిడ్జి రహదారిగా మారింది. దీంతో రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా పోయింది. భద్రాచలానికి ఇప్పుడు అంత పేరు వచ్చిందంటే అది గోదావరి బ్రిడ్జి పుణ్యమే అని చెప్పాలి. ఒకవైపు భద్రాచలం పేపర్ బోర్డుకు వెదురు మన్యం ప్రాంతాల నుంచి రావాలంటే కోట్ల విలువైన సంపదకు రవాణా సౌకర్యంగా మారింది.

## ఎన్నో వరదలను తట్టుకున్న చరిత్ర..

ఎక్కడో వరద వస్తే ఇక్కడ ప్రాంతాలు మునిగిపోవాల్సిందే. అలాంటి ఉగ్ర గోదావరి వరదల సమయంలో భీకరంగా పొంగి ప్రవహిస్తుంటే తట్టుకున్న గోదావరి బ్రిడ్జి కట్టడం నేటికీ చెక్కుచెదరలేదు. ఒకసారి కాదు రెండుసార్లు కాదు ఏకంగా 11 సార్లు మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహించినా ప్రవాహానికి ఎదురొడ్డి నిలిచిన చరిత్ర ఉంది. తొలిసారిగా 1976లో 63.9 అడుగులు వరద ప్రవాహం వచ్చింది. 1986లో 75.6 అడుగులు వచ్చి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. 1990లో 70.8అడుగులు మేర నీటిమట్టం వచ్చింది. గత ఏడాదిలో కూడా 71 అడుగులు వరద వచ్చినా వంతెనకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఎన్నో ఆటుపోట్లను చవిచూసిన వంతెన కట్టడం చాలా గట్టిదే.

## రామయ్య సన్నిధికి పెన్నిధి..

జగదభిరాముడి కల్యాణాన్ని తిలకించడానికి ప్రతి ఏటా లక్షల మంది భక్తులు వస్తున్నారంటే ఆ ఘనత గోదావరి బ్రిడ్జిదే. దాదాపు ఐదు రాష్ట్రాల నుంచి భక్తులు పుష్కరాల మొదలు ముక్కోటి, పట్టాభిషేకాలకు అధికసంఖ్యలో వస్తుంటారు. అంతటి చరిత్ర కలిగిన ఈ వంతెన పక్కనే మరో వారధి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పురుడు పోసుకుంది. గత రామయ్య కల్యాణానికి భక్తులు రెండవ వారధిపై కూడా రాకపోకలు సాగించారు.

## రూ.70 లక్షలతో నిర్మాణం పూర్తి..

అప్పట్లో కేవలం రూ.70 లక్షలతో నిర్మాణం పూర్తి చేసుకున్న వంతెన 3,934 అడుగుల పొడవు, 37 పిల్లర్లు, ఒక్కో పిల్లర్ మధ్య 106.6 అడుగుల దూరంతో నిర్మాణం చేపట్టారు. చాలా తక్కువ ఖర్చుతో నిర్మాణం చేపట్టిన ఈ వంతెనను రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 1965లో ప్రారంభించారు. అప్పటి నిర్మాణాలు ఎంత పటిష్టంగా ఉంటాయో చెప్పడానికి ఈ వంతెనే సజీవ సాక్ష్యం.

# గిరిజనుల సంక్షేమానికే ఐటీడీఏలు

- మారుమూల గ్రామాల్లో సౌకర్యాలు కల్పించాలి
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్

భద్రాచలం, జూలై 13 : గిరిజనుల విద్యాభివృద్ధి, ఆర్థికాభివృద్ధికి, రైతుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఐటీడీఏలను నెలకొల్పిందని, ఇవి గిరిజనులకు దేవాలయాల వంటివని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. శనివారం ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజనుల భూ, వ్యక్తిగత, గ్రామాల్లోని సమస్యలు, పరిష్కరించడానికి గిరిజన సంఘాల నాయకులు, అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత ఐటీడీఏ కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు అధికారులు, ఆదివాసీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులకు రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయిలో పరిష్కారం కానీ సమస్యలు పరిష్కరించడానికి ప్రధానమంత్రి మోదీ ఎస్సీ, ఎస్టీ కమిటీలతో తనను నియమించారని తెలిపారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, రహదారుల సౌకర్యం కల్పించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. గిరిజనుల భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు ఏమైనా పెండింగ్‌లో ఉంటే వాటికి ప్రతిపాదనలు తయారు చేసి పది రోజుల్లోగా నివేదిక అందజేయాలని ఐటీడీఏ అధికారులను ఆదేశించారు. గిరిజనులకు పోడు పట్టాలు, గిరిజన పాఠశాలల్లో సమస్యల గురించి ఆదివాసీ, గిరిజన నాయకులు ఆర్జీలు సమర్పించగా.. గిరిజనులకు పోడు పట్టాల విషయమై చర్యలు తీసుకోవాలని, కొన్నిచోట్ల గిరిజనులు పోడు సాగు చేసుకుంటున్నా వారికి పట్టాలు లేవని, వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. అనంతరం ఎంఎస్‌ఎంఈ యూనిట్ మహిళలు తయారు చేసిన షాంపూలు, సబ్బులు పరిశీలించి, వారికి జీవనోపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రైకార్ జీఎం కుంజా శంకర్, ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, ఆర్డీవో దామోదర్‌రావు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఐటీడీఏ అధికారులు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గిరిజనులకే ప్రాధాన్యం ఇవ్వాలి

బూర్గంపాడు, జూలై 13 : గిరిజన ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి రంగాల్లో గిరిజన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వాలని, దీంతో వారి కుటుంబాలను పోషించుకునేందుకు వీలు కలుగుతుందని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. శనివారం బీపీఎల్ అతిథి గృహంలో ఐటీసీలో పనిచేసే కార్మికుల సమస్యల గురించి యూనియన్ ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీసీలో పనిచేసే సిబ్బంది తెలంగాణ వారై ఉండి.. అందులో ఎక్కువ శాతం గిరిజనులకే అవకాశం కల్పించాలన్నారు. అనంతరం యూనియన్ నాయకులు ఆయనను శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ట్రైకార్ జీఎం శంకర్‌రావు, ఆర్డీవో దామోదర్‌రావు, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి మణెమ్మ, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ, వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

# 'దుమ్ము'తో ఇబ్బంది లేకుండా చూడాలి



శైలో బంకర్‌ను పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్

సత్తుపల్లిటౌన్, జూలై 13 : బొగ్గు దుమ్మును నియంత్రించడంతోపాటు పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి అధికారులకు సూచించారు. సత్తుపల్లి పట్టణ పరిధిలోని జలగం వెంగళరావు కిష్టారం ఉపరితల గనుల నుంచి కొత్తగూడెంకు బొగ్గు చేరవేయడానికి ఏర్పాటు చేసిన శైలో బంకర్ పనితీరును శనివారం ఆయన పరిశీలించారు. వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో కొత్తగూడెం జీఎం శాలెంరాజు, సివిల్ జీఎం సూర్యనారాయణ, జేవీఆర్‌వోసీ పీవో ప్రహ్లాద్, కిష్టారం ఓసీ పీవో నరసింహారావు, మేనేజర్ రామకృష్ణ పాల్గొన్నారు.

# ఖమ్మంలో జోస్ ఆలుక్కాస్ షోరూం ప్రారంభం

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి తుమ్మల

రఘునాథపాలెం, జూలై 13 : ఖమ్మం నగరంలో ప్రముఖ జ్యువెల్లరీ సంస్థ జోస్ ఆలుక్కాస్ నూతన షోరూంను ప్రారంభించింది. నగరంలోని వైరా రోడ్డులో ఏర్పాటు చేసిన షోరూంను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సినీ నటి సంయుక్త మేనన్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని శనివారం ప్రారంభించారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా యాజమాన్యం వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఆఫర్ సందర్భంగా వజ్రాలు, ఆభరణాలు కొనుగోలు చేసిన వినియోగదారులకు ప్రోత్సాహక బహుమతులను నిర్వాహకులు అందజేశారు. ఆఫర్ ఈ నెల 19వ తేదీ వరకు ఉంటుందని మేనేజింగ్ డైరెక్టర్లు ఫ్లర్టీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా, జోస్ ఆలుక్కాలు తెలియజేశారు. జోస్ ఆలుక్కాస్ షోరూంను ఖమ్మం నగరంలో ఏర్పాటు చేయడం పట్ల మంత్రి తుమ్మల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా షోరూం మేనేజింగ్ డైరెక్టర్లను అభినందించారు.




జోస్ ఆలుక్కాస్ షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల, సినీ నటి సంయుక్త మేనన్

# ఉమ్మడి జిల్లాలో వర్షం

- చెరువులు, కుంటల్లోకి చేరిన నీరు
- సాగు పనుల్లో నిమగ్నమైన రైతాంగం

జూలూరుపాడు/అన్నపురెడ్డిపల్లి/పెనుబల్లి/అశ్వారావుపేట రూరల్, జూలై 13 : అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జూలూరుపాడు మండలంలోని వెంగన్నపాలెం, పాపకొల్లు, పడమటనర్సాపురం, జూలూరుపాడు, గుండెపుడి, మాచినేనిపేటతండా, బేతాళపాడు గ్రామ పంచాయతీల పరిధిలో భారీ వర్షం కురవడంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. దీంతో 79.8 మిల్లీ మీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో శనివారం ఎడతెరిపి లేకుండా వర్షపు జల్లులు కురవడంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. అశ్వారావుపేట మండలంలోని పలు గ్రామాల్లో శనివారం తెరిపివ్వకుండా వర్షం కురవడంతో 24.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షంతో చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరింది. గుమ్మడవల్లి సమీపంలోని పెదవాగు ప్రాజెక్టులోకి 4.5 మీటర్ల మేర వరద నీరు చేరింది. అంకమ్మచెరువు, దబ్బతోగు, పాలవాగు, లోతువాగు, కోతులవాగు, బొగందానిగండి, మొద్దులమాడ, బండారుగూడెం గ్రామాల్లోని చిన్నతరహా చెరువుల్లోకి నీరు చేరింది. శనివారం వేకువజాము నుంచి ఏకధాటిగా వర్షం కురవడం వల్ల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. పెనుబల్లి మండలంలో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు జోరు వాన కురిసింది. దీంతో మండలవ్యాప్తంగా 32.54 వర్షపాతం నమోదైంది. వీఎం బంజర బస్టాండ్ ప్రాంగణంలో నీరు నిలిచింది. లంకాసాగర్ మధ్యతరహా ప్రాజెక్టులోకి 11.6 శాతం వర్షపు నీరు చేరింది. మండలంలోని రైతులు ఉదయం నుంచే సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.



పెనుబల్లి : వీఎం బంజరలో కురుస్తున్న వర్షం



అన్నపురెడ్డిపల్లి : వరి నాటు వేస్తున్న కూలీలు



జూలూరుపాడు : మండలంలో కురుస్తున్న భారీ వర్షం



పెనుబల్లి : తాళ్లపెంటలో కురుస్తున్న వర్షం